ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 39 శుక్రవారం 7-02-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

# విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలి

## స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలపై దృష్టి సారించండి

**- సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పుకోండి - సిఎల్పి భేటీలో ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం**



**హైదరాబాద్,ఫిబ్రవరి6:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొత్త, పాత నేతలు సమన్వయంతో సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో కొత్త పాత నేతలు సమన్వయంతో సాగితేనే స్థానిక సంస్థల్లో పాగా వేయగలమని సూచించారు. కామారెడ్డి డిక్లరేషన్ కు అనుగుణంగా బీసీ కులగణన చేపట్టామని, ప్రతిపక్షాలు అనవసర రాద్దాంతా చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ఉత్తర తెలంగాణలో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేద్దామని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రాభవాన్ని నిలబెట్టుకోవాలని, ప్రతీ స్థాయిలో విజయాన్ని సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. అలాగే సమస్యలపై ఎమ్మెల్యేలు నేరుగా తనను కలుసుకోవచ్చని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డిలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఏకగ్రీవ విజయం సాధించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిదర్శనంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, వివిధ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, నిధుల కేటాయింపు కోసం తక్షణమే సంబంధిత మంత్రులను కలవాలని సూచించారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇది పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండేలా, బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. బీసీ నాయకత్వాన్ని ముందుకు తేవడానికి, వారికి అధికారంలో మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మరింత దృఢంగా నిలిచేలా చేస్తుందని, అందుకే ప్రతి నియోజకవర్గం స్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ విజయానికి శ్రమించాలని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. బీసీ కులగణను శాస్త్రీయంగా చేపట్టామని, దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని అపోహాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గాల స్థాయిలోనే కౌంటర్ అటాక్ చేయాలని సూచించారు. అదే విధంగా ఎస్సీ వర్గకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, చెప్పామని, దానిని అమలు చేసి చూపామని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వివరించేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఈ మేరకు సమావేశంలో నిర్ణయించారని సమాచారం. దీంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనా చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు ఏమైనా సమస్యలుంటే తన వద్దకు వచ్చి నేరుగా చెప్పుకోవచ్చని సీఎం చెప్పారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలపై ప్రతిపక్షాలు లేని పోని అపోహాలు సృష్టిస్తున్నాయని, అదే స్థాయిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా కౌంటర్ ఇవ్వాలని సూచించినట్టు సమాచారం.

# అంబేడ్కర్‌ను ఏనాడూ గౌరవించని కాంగ్రెస్

**ఓట్ల కోసం జైభీమ్ నినాదాలు చేస్తోంది**

**అంబేడ్కర్‌ను ఓడించేందుకు అనేక కుట్రలుచేసింది**

**రాజ్యసభలో మరోమారు కాంగ్రెస్‌ను దునుమాడిని మోడీ**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి6:** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల కాంగ్రెస్‌కు ఏనాడూ గౌరవం లేదని ప్రధాని మోడీ అన్నారు. ఓట్ల రాజకీయంకోసం ఇప్పుడు ఆయన పేరును వాడుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని మారోసారి టార్గెట్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినదంతా.. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించేదని అన్నారు.. బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని ఆరోపించారు, సామాజిక సంస్కర్త పట్ల ఆ పార్టీ దారుణంగా ప్రవర్తించిందన్నారు.. అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించలేదు.. అంబేద్కర్‌ను ఓడించేందుకు కుట్రలు చేసిందని విమర్శించారు.. కానీ, ఇప్పుడు ఓట్ల కోసం జై భీమ్ నినాదాలు చేస్తోంది.. కాంగ్రెస్ రంగులు మార్చే పార్టీ అని దుయ్యబట్టారు.. ఎస్సీ, ఎస్టీల ఆర్థిక వెనుకబాటు తనాన్ని అంబేద్కర్ తొలగించాలని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ఆ పని చేయలేకపోయిందన్నారు..కాంగ్రెస్ బీఆర్ అంబేద్కర్‌తో దారుణంగా వ్యవహరించింది? వారు ఆయనను వ్యతిరేకించారు.. బాబాసాహెబ్ చెప్పినదంతా కాంగ్రెస్‌ను వ్యతిరేకించేది అని ప్రధాని మోడీ అన్నారు. ప్రతిదానికీ డాక్యుమెంట్స్ ఎవిడెన్స్ ఉన్నాయి.. వాటిని ధృవీకరించవచ్చన్న ఆయన.. ఎన్నికల్లో బాబాసాహెబ్ ఓడిపోయేలా కాంగ్రెస్ ఎటువంటి రాయిని వదిలిపెట్టలేదన్నారు.. ఎందుకంటే వారు ఆయనను సహించలేక పోయారు. భారతరత్నకు ఆయన అర్హుడని భావించలేదు అంటూ ఫైర్ అయ్యారు.. సబ్ కా సాత్ కాంగ్రెస్‌కు సాధ్యం కాదు అని స్పష్టం చేశారు.. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనేది కాంగ్రెస్ పార్టీకి అర్థం కాని విషయం అని పేర్కొన్నారు.. కాంగ్రెస్ విషయానికొస్తే? వారు సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ ఆశించడం పెద్ద తప్పు? అది వారి ఆలోచనలకు అతీతమైనది.. వారి రోడ్ మ్యాప్ కు కూడా సరిపోదు.. ఎందుకంటే అది ఒక పెద్ద పార్టీ.. ఒక రాజవంశానికి అంకితం చేయబడింది కాబట్టి.. వారికి సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ సాధ్యం కాదు అని విమర్శించారు..మేం స్కిల్ డెవలప్‌మెంట్‌తో వెనుకబడి వర్గాల జీవితాలను మెరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నాం.. విశ్వకర్మ యోజనతో చేతివృత్తులవారి అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం అన్నారు మోడీ.. కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యం చేసిన పేదలను మేం గౌరవిస్తున్నాం.. పేదల అభివృద్ధే మా ప్రథమ ప్రాధాన్యం అని స్పష్టం చేశారు.. కేవలం అర్హులకే లబ్ది చేకూరేలా పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాం.. పదేళ్లలో సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మార్పును గమనిస్తున్నాం.. ఎస్సీ, ఎస్టీలను బలోపేతం చేస్తున్నాం.. ఓబీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇవ్వలేదు.. మేం వచ్చాక ఓబీసీల డిమాండ్‌ను నెరవేర్చాం.. దేశంలో దివ్యాంగుల గురించి మిషన్ మోడ్‌లో పనిచేస్తున్నాం.. దివ్యాంగుల కోసం ఎన్నో రకాల పథకాలు చేపట్టాం.. ట్రాన్స్‌జండర్స్ గౌరవంతో బతికేలా చర్యలు తీసుకున్నాం అని ప్రధాని మోడీ వెల్లడించారు..

# విసిల నియామకంలో యూజిసి పెత్తనం సరికాదు

**విద్యార్థుల ప్రయోజనాలకు ఇది విఘాతం**

**కేంద్రమంత్రికి కెటిఆర్ వినతి పత్రం అందచేత**

**ఎన్‌హెచ్ 365 పొడిగించాలని గడ్కరీకి కెటిఆర్ వినతి**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి6:** యూజీసీ నూతన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు నివేదించినట్లు మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. రాష్ట్ర వర్సిటీల్లో సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ‘నూతన నిబంధనల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుంది. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం అధీనంలోకి తీసుకోవాలనుకుంటున్నారు. యూజీసీ నిబంధనల అభ్యంతరాలపై 6 పేజీలతో నివేదిక ఇచ్చాం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని విన్నవించాం. మరోవైపు ఎన్‌హెచ్-365బి రహదారిని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామని కేటీఆర్ తెలిపారు.కెటిఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసింది. యూజీసీ ముసాయిదా నిబంధనలపై కేంద్రానికి బీఆర్ఎస్ నేతలు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఆ తర్వాత 365బీ జాతీయ రహదారిని సూర్యాపేట-సిరిసిల్ల రహదారిని కోరుట్ల వరకు విస్తరించాలంటూ నితిన్ గడ్కరీని కోరింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. నూతన నిబంధనలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. మా అభిప్రాయాలు తెలియజేసేందుకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినట్లు తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను రాష్ట్ర గవర్నర్ల ద్వారా కేంద్రం నియంత్రించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరూద్ధమన్నారు. సెర్చ్ కమిటీల బాధ్యతలను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ.. కొత్త నిబంధనలు రూపొందించారని.. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం తమ ఆధీనంలోకి తీసుకోవాలని అనుకుంటుందని ఆరోపించారు. నూతన నిబంధనలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. యూజీసీ నిబంధనలపై అభ్యంతరాలను ఆరు పేజీలతో నివేదిక కేంద్రమంత్రికి ఇచ్చినట్లు వివరించారు. నిబంధనలను సవరించాలని మంత్రిని కోరామన్నారు. ఇలా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని చెప్పామన్నారు. అలాగే, జాతీయ రహదారి 365బీని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామన్నారు. ఇక పార్టీ పిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడాల్సిందేనన్నారు. అనర్హత వేటు పిటిషన్లపై న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

# కులగణనపై విపక్షాల విమర్శలు తిప్పికొట్టాలి

**పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నాం**

**పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం**

**ఈ నెలలోనే రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి**



**హైదరాబాద్,ఫిబ్రవరి6:** కులగణనపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని వాటిని తిప్ఇకొట్టాలని కాంగ్రెస్ నిర్ణయించిందని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యేలకు సూచించామని అన్నారు. పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం. రాష్ట్ర ఆదాయం, అప్పులు, వ్యయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాం. ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం. బహిరంగ సభలకు అధిష్ఠానం నేతలను ఆహ్వానించేందుకే దిల్లీ వెళ్తున్నాం. ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశాలు నిర్వహించుకోవటం తప్పేమీ కాదని కూడా అన్నారు.

సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చించామని తెలిపారు.‘స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించాం. సమావేశంలో ఎమ్మెల్యేలు కూడా వారి అభిప్రాయాలు చెప్పారు. పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. సుమారు మూడు గంటలకు పైగా సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించామని అన్నారు. ఈ క్రమంలో సమావేశంలో చర్చించిన అంశాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. .స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా కులగణన చేపట్టామని... రాహుల్ గాంధీ ఆశయం మేరకు పరిపూర్ణంగా సర్వే చేసి ఎవరు ఎంత సంఖ్యలో ఉన్నారో తేల్చామని అన్నారు. వాస్తవాలు తెలియక బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ బీసీ సంఘాలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. చాలా అంశాలపై సీఎల్పీ సమావేశం జరిగిందని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సూర్యాపేటలో కులగణన జరిగిన తీరుపై బహిరంగ సభ నిర్వహించ నున్నామని.. ఈ సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను ఆహ్వానించటానికి ఢిల్లీ వెళ్తున్నామని అన్నారు. ఈ సమావేశం ద్వారా ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలు నివృత్తి చేశామని అన్నారు. బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే కేటిఆర్ ఢిల్లీ వెళ్లారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# చాపకింద నీరులా డ్రగ్స్ అమ్మకాలు

**మాదాపూర్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్**

**హైదరాబాద్,ఫిబ్రవరి6** హైదరాబాద్ మహానగరంలో డ్రగ్స్ విక్రయం చాప కింద నీరులా విస్తరిస్తోంది. పోలీసులు సైతం ముమ్మర తనిఖీలు నిర్వహించానా.. ఈ డ్రగ్స్ విక్రయం మాత్రం ఆగడం లేదు. ప్రభుత్వం సైతం డ్రగ్స్ అంశంలో కఠిన వైఖరి అవలంబిస్తోంది. కానీ డ్రగ్స్ విక్రయాలు మాత్రం ఆగడం లేదు. మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారస్తులే లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఓటీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. మరోవైపు డ్రగ్ విక్రయిస్తున్న ఒలివర్ అలియాస్ జాన్సన్‌ను అరెస్ట్ చేశామని టాస్క్ ఫోర్స్ డీసీపీ సుధీంద్ర బుధవారం హైదరాబాద్‌లో వెల్లడించిన విషయం విదితమే. హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేయడానికి డ్రగ్ పెడర్లు వచ్చినట్లు తమకు సమాచారం అందిందని చెప్పారు. ఈ నేపథ్యంలో లంగర్ హౌస్ పోలీసులతో కలిసి నార్కోటిక్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారన్నారు. దీంతో డ్రగ్స్ కేసులో ఆఫ్రికాకి చెందిన ముగ్గురు డ్రగ్స్ నిందితులను అరెస్ట్ చేశామని వివరించారు. 2009లో జాన్సన్ అలియాస్ జాన్.. బిజినెస్ వీసాపై ఇండియాకు వచ్చాడని.. అతడి వీసా గడువు 2013లో ముగిసిందని తెలిపారు.ఇండియా వచ్చిన అనంతరం అతడు డ్రగ్స్ సరఫరా చేస్తూ వస్తున్నాడని పేర్కొన్నారు. ఢిల్లీ నుండి బెంగళూరుకు బల్క్‌లో డ్రగ్స్ సప్లై చేసేవాడని చెప్పారు.

# యూజిసి నిబంధనలు దేశ సంస్కృతిపై దాడి

**ఆర్‌ఎస్‌ఎస్ భావజాల జొప్పించే ప్రయత్నం**

**డిఎంకె ఆందోళనలో రాహుల్ విమర్శలు**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి6:**



యూజీసీ ముసాయిదా విద్యాపరమైన చర్య మాత్రమే కాదని, ఇది మన చరిత్ర, సంప్రదాయం, సంస్కృతి, భాషలపై దాడి చేసేందుకు ఆరెస్సెస్ చేస్తున్న ప్రయత్నం అని కాంగ్రెస్ ఎంపి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఇదే విషయాన్ని తాను కొంతకాలంగా చెబుతున్నానని అన్నారు. ఈ దేశంలో ఒకే చరిత్ర, ఒకే సంప్రదాయం, ఒకే భాష విధించాలనే ఆలోచనతోనే వారు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని అన్నారు. వివిధ రాష్ట్రాల విద్యా వ్యవస్థపై వారు చేస్తున్న ఈ ప్రయత్నం తమ ఎంజెడాను ముందుకుతీసుకెళ్లేందుకే అని రాహుల్ విమర్శించారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రవేశపెట్టిన నూతన ముసాయిదా నిబంధనలు భాజపాయేతర రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ముసాయిదాకు వ్యతిరేకంగా డీఎంకే విద్యార్థి విభాగం గురువారం దిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసనలకు దిగింది. ఈ నిరసనలో డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధితో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. యూజీసీ ప్రవేశపెట్టిన ముసాయిదాను తాము వ్యతిరేకిస్తున్నట్లు అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఈ నూతన విధానం యూనివర్శిటీలను పారిశ్రామికవేత్తలకు అప్పగించే కుట్రగా ఆయన పేర్కొన్నారు. ఈ విధానానికి తాము ఎప్పటికీ మద్దతు ఇవ్వబోమన్నారు. వర్శిటీలు, కళాశాలల్లో అధ్యాపకులు, బోధనా సిబ్బంది నియామకం, పదోన్నతి కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు మార్గదర్శకాలు-2025 పేరిట యూజీసీ ఇటీవల ఓ ముసాయిదాను విడుదల చేసింది. అందులోని పలు అంశాలు బాగా వివాదాస్పదమవుతున్నాయి. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాల అధిపతులైన ఉపకులపతుల నియామకం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలో ఉంది. నూతన ముసాయిదా ప్రకారం ఆ అధికారం ఛాన్సలర్లుగా ఉన్న గవర్నర్ల చేతుల్లోకి వెళ్తుంది. ఈ మార్పును భాజపాయేతర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. తమిళనాడు, కేరళ వంటివి ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ చట్టసభల్లో తీర్మానం కూడా చేశాయి.

# ఇసుక లారీ బీభత్సం..

**- కాటారం మండల కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం..**

**- బైక్ను ఢీ కొట్టిన ఇసుక లారీ.. - తోట రవి అనే యువకునికి తీవ్ర గాయాలు**

**జయశంకర్ భూపాలపల్లి (తొలి సమయం ప్రత్యేక ప్రతినిధి పోనగంటి స్వామి రావు) ఫిబ్రవరి 6:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం గురువారం చోటు చేసుకుంది. కాటారం మండల కేంద్రంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది వివరాల్లోకెళ్తే బైక్పై వెళ్తున్న తోట రవిని అకస్మాత్తుగా ఇసుక లారీ ఢీకొట్టడంతో అతని కాళ్లు నుచ్చు నుచ్చు కావడంతో రోడ్డుపై బైక్ తో పడిపోయారు..
ఈ ఘటన కాటారం మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం కు తరలించారు. కాళేశ్వరం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రానికి ప్రధాన నేషనల్ హైవే రహదారి ఎప్పుడు కప్పుడు ఇసుక లారీలు ఒక బీభోత్సవాన్ని సృష్టిస్తున్నాయి. ఇసుక లారీలు ఓవర్ లోడ్ తో అధిక స్పీడ్ తో పోవడంతోనే భారీ ఎత్తున రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు... ఈ ప్రమాదాలను నివారించాలని స్థానిక సంబంధించిన అధికారులను కోరుతున్నారు... ఇసుక లారీ ఢీకొట్టడంతో బైక్ వెళుతున్న తోట రవి కి తీవ్ర గాయాలు కావటం అతని రెండు కాళ్లపై చర్మం లేకుండా నుజ్జునుచ్చు కావడం అతనికి న్యాయం చేయాలంటూ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.



# కేంద్ర బడ్జెట్లో తెలంగాణ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ ఈనెల 8న కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, నిరసన**

**ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**



**తొలి సమయం నర్సంపేట ప్రతినిధి ఫిబ్రవరి 6:**
50 లక్షల 65 వేల కోట్ల రూపాయల కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కనీస కేటాయింపులు లేకపోవడం అన్యాయమని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు బడ్జెట్ రూపొందించకుండా దోపిడి వర్గాలకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం సిగ్గుచేటని ఎం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను, తెలంగాణ పట్ల వివక్షపూరిత కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 8న కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన తెలుపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు నర్సంపేట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆదాని అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కోసమే కేంద్ర బడ్జెట్ అన్నట్లుగా ప్రవేశపెట్టి రైతులను కూలీలను కార్మికులను మహిళలను సామాజిక తరగతులను విస్మరించారని కనీసం గతంలో కేటాయించిన విధంగానైనా ఈ బడ్జెట్లో నిధులు కేటాయించకుండా కోతలు విధించి ప్రజా వ్యతిరేక బడ్జెట్ గా దోపిడి వర్గాల పాలకులుగా నిరూపించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు నిధులు పెంచాల్సింది పోయి సబ్సిడీలు తగ్గించారని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి దొరకకుండా బడ్జెట్లో కోత విధించారని పంటల ధరల నియంత్రణకు బడ్జెట్ కేటాయింపులే లేవని ఈ బడ్జెట్ పేదలపై భారాలు- కార్పొరేట్ శక్తులకు వరాలు అన్న మాదిరిగా ఉన్నదని, ఇంకొక వైపు తెలంగాణ రాష్ట్రానికి ఏ విధమైన బడ్జెట్ కేటాయింపులు లేకుండా తీరని అన్యాయానికి వివక్షతకు గురి చేశారని రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న ఒరిగింది శూన్యమని గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని పరిపూర్ణంగా అమలు చేసే విధంగా బడ్జెట్ లేదని, ఇలాంటి పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర అభివృద్ధికి వివిధ తరగతులు వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత ప్రకారం నిధులు కేటాయించే విధంగా పోరాడాలని ఈ క్రమంలో ఈనెల 8న కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

# నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.సత్య శారద





**తొలి సమయం వరంగల్/ నర్సంపేట ప్రతినిధి ఫిబ్రవరి06 :**
నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల లో విద్యార్థుల కు మెరుగైన వసతులు కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అధికారులను ఆదేశించారు. నర్సంపేట లోని ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలలను గురువారం కలెక్టర్ సందర్శించి ఆసుపత్రి ఆవరణ తో పాటు కళాశాల లెక్చర్ హాల్ హాస్టల్ యందు పర్యటించి వైద్య విద్యార్థులలో మాట్లాడి వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సంబంద అంశాలు తన దృష్టికి రావడం జరిగిందని శానిటేషన్ గురించి నర్సంపేట మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయనున్నట్లు, హాస్పిటల్ యందు ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసి పేషెంట్ సేవలు అందించేందుకు చర్యకు చేపడతామని అన్నారు. అధికారులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు.అంతకు ముందు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో గల డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నిర్వహిస్తున్న రిజిస్టర్ ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య కళాశాల నియంత్రణ లోకి తెస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టి వి వి పి)ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఇందుకు సంబంధించిన విషయాల తో పాటు వైద్య కళాశాల లో పూర్తి స్థాయి లో చేయాల్సిన ఏర్పాట్ల పై త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.మోహన్ దాస్ ప్రో.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**తొలి సమయం దంతాలపల్లి మండలం ఫిబ్రవరి 6**
దంతాలపల్లి మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ఈరోజు క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. అలాగే ఫిబ్రవరి 19 తేదీన మండల అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో సంఘం నాయకులు పాల్గొని కంఠమహేశ్వర కౌశల్ సేఫ్టీ మూకులు ప్రభుత్వం ద్వారా ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి వెళ్లడానికి 19వ తారీఖున మండలంలో భారీ సభ నిర్వహించాలని తీర్మానించనైనది. ఈ కార్యక్రమంలో గుండె గాని లింగయ్య, కొత్త అంతయ్య కొత్త కొమురెల్లి చీకటి ఉప్పలయ్య పొడిశెట్టి వెంకటనారాయణ రేసు బిక్షం గుర్రం ముత్తు బుర్ర శ్రీను బుర్ర శ్రీరాములు బుర్ర రాములు బుర్ర వెంకన్న గండి అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ




తొలి సమయం నర్సంపేట ప్రతినిధి ఫిబ్రవరి 6:
వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ రోజు ఉదయం నల్లబెల్లి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న సీపీ స్టేషన్ ఎక్కడ వున్నాడు, మిగితా సిబ్బంది ఏం విధులు నిర్వహిస్తున్నారో స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ను సీపీ అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ పరిసరాలను సీపీ పరిశీలించారు

## ఘనంగా జన్మదిన వేడుకలు



**తొలి సమయం ములుగు జిల్లా ప్రతినిధి:**
ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు, స్వర్గీయ నల్లెల్ల కుమారస్వామి వీరాభిమాని, ములుగు పట్టణ ప్రధాన కార్యదర్శి కోగిల రాంబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మొదట తన రాజకీయ గురువు స్వర్గీయ నల్లెల్ల కుమారస్వామి చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించి, ఆశీర్వాదం తీసుకొని తదనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పల్లె జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బండారి హరినాథం, కాంగ్రెస్ పార్టీ ములుగు పట్టణ అధ్యక్షులు చింత నిప్పుల బిక్షపతి, అనంతరం సహచర తెలంగాణ ఉద్యమకారులు అచ్చునూరి కిషన్ ముదిరాజ్, కుక్కల నాగరాజు ముదిరాజ్, భూమ నరేష్ ముదిరాజ్, మేకల రమేష్ ముదిరాజ్, కోగిల మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా కోగిల రాంబాబు'కు శాలువా కప్పి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నాకు ఈరోజు జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన పెద్దలకు, మిత్రులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రాజకీయాల్లో యువతే కీలకం..

**కాంగ్రెస్ ప్రభుత్వ 420 హామీల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..**

**ప్రజలు మళ్ళీ బిఆర్ఎస్ నే కోరుకుంటున్నారు..**

**- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..**



**తొలి సమయం వరంగల్ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 6:**
రాష్ట్ర ప్రజలు మళ్ళీ బిఆర్ఎస్ నే కోరుకుంటున్నారని,కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలపై ప్రజలు గుర్రుగా ఉన్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు అన్నారు.గురువారం హన్మకొండలోని వారి నివాసంలో సంగెం,గీసుగొండ, ఖిలా వరంగల్ మండలాలకు చెందిన బిఆర్ఎస్ యూత్ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ కు త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయ్, యువత రాజకీయాల్లో రావాలి. రానున్న రోజుల్లో యువతదే రాజకీయాల్లో కీలక పాత్ర సోషల్ మీడియాలో బిఆర్ఎస్ పై చేస్తున్న తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టాలి.420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం హేయమైన చర్య కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమకేసులకు బయపడేది లేదు.ప్రతి కార్యకర్తకు అండగా ఉండి కంటికిరెప్పల కాపాడుకుంట... ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను,అక్రమాలను గమనిస్తున్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.గ్రామంలో ప్రతి కార్యకర్త సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషిచేయాలి. రాష్ట్ర ప్రజలు మళ్ళీ బిఆర్ఎస్ ను కోరుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దళిత బిడ్డ నాగయ్య మృతికి
# కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలి

సంక్షేమ పథకాల పేరుతో పేదల ప్రాణాలు తీస్తున్న రేవంత్ సర్కార్..

కాంగ్రెస్ మోసపూరిత హామీలకు బలి అయిన నాగయ్య కుటుంబాన్ని ఎంజీఎం మార్చురీ వద్ద పరామర్శ...

బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ..





**తొలి సమయం వరంగల్ ప్రతినిధి ఫిబ్రవరి 6:** తెలంగాణ రాష్ట్రం రేవంత్ రెడ్డి సర్కార్ సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదని గ్రామసభలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ములుగు జిల్లా, బుట్టాయిగూడెంకు చెందిన కుమ్మరి నాగయ్య (నాగేశ్వర్ రావు) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు గురువారం వరంగల్ ఎంజీఎం మార్చురీ వద్ద మృతి చెందిన నాగయ్య కుటుంబాన్ని పరామర్శించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది రోజులుగా ఎంఎస్ఆర్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్న నాగయ్య గురువారం మరణించారు.

ఎంజీఎం పోస్టుమార్టం లో ఉన్న వారి పార్టీవ దేహాన్ని సందర్శించి అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుంటే, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖం చాటేస్తే, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పింది బిఆర్ఎస్ పార్టీ...అని నాగయ్యకు మంచి వైద్యం అందించి, ప్రాణాలు కాపాడేందుకు ములుగు జిల్లా బిఆర్ఎస్పార్టీ ఎంతో ప్రయత్నించింది. కానీ దురదృష్టవశాత్తు నాగయ్య ప్రాణాలు పోయినాయని, తన చావుతోనైనా అర్హులైన పేదలకు పథకాలు ఇవ్వాలని అధికారులకు చెబుతూ పురుగుల మందు త్రాగి ఆసుపత్రి పాలైన నాగయ్య దుస్థితికి ప్రభుత్వమే కారణం అని ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యాని ఉన్నదాంతో కుటుంబాన్ని పోషిస్తూ జీవితం గడుపుతున్న నాగయ్య కుటుంబంలో గ్రామ సభల పేరిట నిప్పులు పోసింది. కాంగ్రెస్ ప్రభుత్వం. భర్తను, తండ్రిని కోల్పోయి కన్నీరు మున్నీరు అవుతున్న భార్య, ముగ్గురు ఆడబిడ్డలను ప్రభుత్వ ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే యావతో, ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరపకుండా, జాబితా విడుదల చేస్తూ ప్రజల్లో గందరగోళం రేపింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. దీంతో పాటు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు అంటూ బాహాటంగా ప్రకటించడంతో గ్రామ సభల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పట్ల ప్రజల్లో ఆందళన మొదలైందని దరఖాస్తుల పేరిట దగా చేయడం తప్ప, ఏడాది పాలనలో మీరు చేసిందేముంది. గ్రామ సభల సాక్షిగా తిరగబడ్డ జనం, ఎక్కడిక్కడ నిలదీసిన దృశ్యాలు.. మీ 14 నెలల పాలన వైఫల్యాన్ని ఎత్తి చూపాయి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పాలిట అభయహస్తం కాదు, భస్మాసుర హస్తం. రోడ్డున పడ్డ నాగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, రూ. 25 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రజలారా.. ఆత్మహత్యలు పరిష్కారం కాదు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ పార్టీపై కొట్లాడుదాం. హక్కుగా రావాల్సిన పథకాలను సాధించుకుందాం. బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది. ధైర్యం కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## న్యాయం జరగలేదు
## గ్రంథాలయం తెరుచుకోలేదు

మా కష్టాలు తొలగించండి సార్ అంటున్న విద్యార్థులు



**మణుగూరు (తొలిసమయం రిపోర్టర్)**

జిల్లా అధికారులు వెంటనే స్పందింస్తారు మాకు న్యాయం జరుగుతుందనే ఉత్సాహంగా కళాశాలకు వెళ్లిన విద్యార్థులకు నిరుత్సాహమే ఎదురైంది. ఇంతకీ ఏం జరిగిందంటే గత పది రోజులుగా విద్యార్థులు పుస్తకాల కోసం గ్రంథాలయం తెరవాలంటు అంతర్గతంగా పోరాటం చేస్తున్న న్యాయం జరగలేదు. కొందరు విద్యార్థులు ఇదే విషయాన్ని వార్తాపత్రికకు సమాచారం ఇవ్వడంతో న్యూస్ రిపోర్టర్స్ కళాశాలను సందర్శించి అత్యంత దయనీయ స్థితిలో ఉన్న గ్రంథాలయం స్థితిగతిని బయటపెట్టారు. వెంటనే జిల్లా అధికారుల స్పందించడంతో గ్రంథాలయం సుందరంగా తయారవుతుందని ఊహించారు కానీ మళ్ళీ అదే జరిగింది రిపోర్టులకు మాత్రమే గ్రంథాలయం సిద్ధమయింది. విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి కానీ వాస్తవాలు వేరేలా ఉన్నాయి. న్యాయం అడిగే విద్యార్థుల గొంతులను అహంకారంతో అనగదొక్కే ప్రయత్నం జరిగింది. ఎవరెవరు పత్రికలకు సమాచారం ఇచ్చారో వారి సంగతి తెలుస్తామంటూ హెచ్చరికలతో హడావిడి జరిగింది. గతంలో ఆర్థిక అవకతవకలు చేసినా మమ్మల్ని ఎవరు ఏం చేయలేకపోయారనే ధీమా స్పష్టంగా వారిలో కనిపిస్తుంది. కళాశాల ఆఫీసులో విద్యార్థులకు అవసరమైన ఏ పని చేయాలన్న వారిని ప్రసన్నం చేసుకోవడానికి సమయం అంతా వృధా అవుతుంది. ఎన్ని సందర్భాలలో ఎంతమంది ప్రశ్నించిన వారిలో మార్పు రాకపోవటం వల్ల కొంతమంది విద్యార్థులు విద్యకు సైతం దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. న్యాయం కోసం ఎవరికి విన్నవించాలో ఎవర్ని మెప్పించాలో తెలియక విద్యార్థులు అమాయకంగా రోజు కూలీలుగా మారిన సందర్భాలు అనేకం. ఒక పూట కూలికి వెళ్తూ ఒక పూట కళాశాలకు వస్తూ చదువుకునే విద్యార్థుల పట్ల జాలి చూపే దయార్థ హృదయం కలిగిన వారికోసం ఎంత ప్రయత్నించినా వృధానే.. ఎవరైనా అధ్యాపకులు విద్యార్థులు తరపున మాట్లాడితే వారిని అనేక రకాలుగా హింసించడం కళాశాలలో పరిపాటిగా మారిపోయింది. వారి జీతాలలో అనవసరపు కోతలను విధిస్తూ హింసించడం కళాశాలలో పరిపాటి. కళాశాలలో ఏ రికార్డు సక్రమంగా లేదు. ఏ పని సక్రమంగా జరగదు. ఏ పద్దులు సక్రమంగా లేవు. ఇది మా సామ్రాజ్యం ఇక్కడంతా అంతా మా ఇష్టారాజ్యమనే భావన కనిపిస్తుంది. కానీ అంతా అవినీతిమయం.. రక్షించే వాడే భక్షించే వాడికి అండగా ఉంటే మరి కాపాడేదెవరు.... అంటూ విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

**మా కష్టాలు తొలగించండి సార్**

చదువుపై మక్కువతో కష్టపడి చదివి ఉన్నత విద్యాధికులమై, ఉజ్వల భవిష్యత్ కోసం ప్రణాళిక చేసుకుందామనకుంటే మాకు దారి చూపి మార్గదర్శకులుగా ఉండాల్సిన గురువులు చేస్తున్న వికృతచేష్టలు, చిల్లర రాజకీయాలు, చూస్తుంటే భయమేస్తుందని దీనిపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపి, ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి న్యాయం జరిగేలా చేసి గ్రంధాలయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. అధికారులు స్పందించేనా? న్యాయం జరిగేనా ? అన్నది వేచి చూద్దాం..

### చిరుమళ్ల సమ్మక్క తల్లి జాతర కొనసాగింపు లో భాగంగా
# "ఆదివాసి సంస్కృతి బి జాతి ఐక్యతను చాటుదాం"

ఆదివాసి కోయత్తూర్ తెగ వేల్పుల సంస్కృతి పునరుద్ధరణకు ఆర్థిక సహాయం చేసిన వారికి ఐటీ సెక్షన్ 80జి ద్వారా సడలింపు, పన్ను మినహాయింపు.....

ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, మేధావులు సమ్మక్క తల్లి కళ్యాణానికి విరాళాలు ఇవ్వండి! చిరుమల్ల సమ్మక్క పుట్టు గద్దెల జాతరకు సహకరించండి : ఆధార్ సొసైటీ







**తొలి సమయం, భద్రాద్రి కొత్తగూడెం ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి6:** ఆదివాసీ కోయత్తూర్ తెగ ఇలవేల్పుల సంస్కృతి పునరుద్దరణ లో భాగంగా చిరుమళ్ల సమ్మక్క – పగిడిద్దరాజుల కళ్యాణం కోసం ఆర్థిక సహాయం అందించే దాతలు మీ విరాళాలు ఆధార్ సొసైటీకి అందించడం ద్వారా ఐటీ సెక్షన్ 80జి ద్వారా టాక్స్ సడలింపు, పన్ను మినహాయింపు పొందవచ్చునని ఆధార్ సొసైటీ జాతీయ చైర్మన్ గోంది వెంకటరమణ రిటైర్డ్ ఈ ఈ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కల్తీ వీరమల్లు రిటైర్డ్ జాయింట్ కలెక్టర్, కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ డిఈ ఓ ప్రకటనలో తెలియజేశారు.. ఈ సందర్భంగా జాతరకు సంబంధించి అనేక విషయాలను తెలియజేశారు.. విరాళాలు ఇవ్వడం ద్వారా సమ్మక్క తల్లి ఆశీస్సులతో పాటు ఐదు రాష్ట్రాల వనదేవతల ఆశీర్వాదాలు పొందవచ్చునని అన్నారు. 2023 సంవత్సరంలో వస్తు , ఆర్థిక రూపేనా విరాళాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈసారి కూడా ఇంతవరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతరకు ఇవ్వదలుచుకున్న ఆర్థిక సహాయం గురించిన సమాచారం నిర్వహణ కమిటీ వారికి అందలేదు, కావున కోయత్తూర్ వేల్పుల రాకపోకల కొరకు, అడ్తి డోలు కళాకారులు, దేవరబాలలు, శివసత్తులు,నాగులమ్మ మాతలు ,పూజ సామాగ్రి కొరకు ఇచ్చే దాతలకు సమ్మక్క తల్లి బండారి, బంగారం, ఇప్ప లడ్డు మరియు ఆధార సొసైటీ ద్వారా ఐటి 80జి టాక్స్ రిసిప్ట్ మీరు తెలియచేసిన అడ్రస్కు పంపించబడును అన్నారు జాతర సమన్వయకర్త చుంచు రామకృష్ణ . చిరుమల్ల సమ్మక్క తల్లి జాతర కొనసాగింపులో భాగంగా ఆదివాసి ల ఐక్యత మరియు సంస్కృతి పునరుద్ధరణకు ప్రాతి ఒక్క ఆదివాసీ బిడ్డ ఓటు బ్యాంక్ రాజకీయాల కతీతంగా నడుం కట్టి సమ్మక్క తల్లి అక్షయపాత్ర ద్వారా వచ్చే 10,11,12 తారీకులలో పినపాక నియోజకవర్గంలోని దాతలను విరాళాలు ఇవ్వమని ప్రతి గూడెం తిరుగుదాం అని చుంచు రామకృష్ణ పిలుపునిచ్చారు.

**సమ్మక్క పగిడిద్దరాజుల కళ్యాణ మహోత్సవానికి ముందు ఘట్టం...**

వెంకటాపురం మండలం ఎదిర గ్రామంలోని పర్షిక వంశస్తులతో కలిసి చందా వంశస్థులు సమ్మక్క తో కళ్యాణానికి పూర్వ మజ్జార్ కొత్తపల్లి పగిడిద్దరాజును ఆదివాసి కోయత్తూరు సంప్రదాయాలతో చిరుమళ్ల కు తీసుకొని రావాలని చందా వంశస్తుల తరపున జోడా వెళ్లిన చందా వీరయ్య ఆహ్వానించారు. ఇరువైపుల వారి అలాయ్ బలయ్ తో పాటు, చేతికి కంకణాలు కట్టుకుని, కళ్యాణం చేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చిరుమల్ల విప్ప చెట్టు గద్దె మీద పందిరిలో చేస్తామని చందా వంశస్థులు, పర్శిక వంశస్థులకు తెలియజేశారు.




## నకిలీ యాప్స్‌తో మోసాలు

ఖాతాదారులను హెచ్చరించిన ఎల్ఐసి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి6:** ఫేక్ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎల్ఐసి తన పాలసీదారులకు సూచించింది. తమ పేరు మీద నకిలీ యాప్స్ సర్క్యులేట్ అవుతున్నట్లు దృష్టికి రావడంతో తాజాగా పబ్లిక్ అడ్వైజరీని జారీ చేసింది. అలాంటి యాప్స్ వలలో పడొద్దని సూచించింది. 'ఎల్ఐసీ ఇండియా పేరు మీద కొన్ని నకిలీ మొబైల్ అప్లికేషన్లు చెలామణి అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కాబట్టి పాలసీహోల్డర్లు, కస్టమర్లు అప్రమత్తంగా ఉండాలి.

## పనామా కెనాల్‌పై నెగ్గిన ట్రంప్ పంతం

పనామా, అమెరికాల మధ్య కుదిరిని ఒప్పందం


**వాషింగ్టన్,ఫిబ్రవరి6:** పనామా కెనాల్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొంతమేరకు పంతం నెగ్గించుకొన్నారు. తమ యుద్ధ నౌకలు ఈ కెనాల్ నుంచి ప్రయాణించినప్పుడు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఆ దేశం అంగీకరించిందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సె వెల్లడించారు. ఈ మేరకు అమెరికా రక్షణ మంత్రి హెగ్సే, పనామా పబ్లిక్ సెక్యూరిటీ మంత్రి ఫ్రాంక్ అలెక్స్‌కు మధ్య ఒప్పందం కుదిరింది. తాజాగా కుదిరిన ఒప్పందం ప్రకారం అమెరికా ప్రభుత్వ నౌకలకు దీని నుంచి భారీ మొత్తంలో నగదు మిగులుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో అక్రమ వలసదారులపై ఆ దేశం తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోందని మెచ్చుకొన్నారు. ఈ ఒప్పందం విషయాన్ని అమెరికా విదేశాంగశాఖ కూడా ధ్రువీకరించింది. 'అమెరికా ప్రభుత్వ నౌకలు ఇప్పుడు పనామా కెనాల్ నుంచి ఎటువంటి ఛార్జీలు లేకుండా ప్రయాణించవచ్చు' అని ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొంది. వాస్తవానికి కొన్నాళ్ల క్రితమే పనామా అమెరికాకు కొన్ని రాయితీలు ఇవ్వాలని నిర్ణయించుకొంది. ఈవిషయాన్ని ఆదివారమే విదేశాంగ మంత్రి రూబియో సూచాయగా వెల్లడించారు. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నాటినుంచి ట్రంప్ పనామా కాల్వను తిరిగి స్వాధీనం చేసుకొంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందుకోసం సైనిక శక్తిని కూడా వాడే అవకాశం ఉందని ఆయన సంకేతాలు ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా ఆ చిన్న దేశంలో ఆందోళన మొదలైంది. అమెరికాకు చెందిన 40 శాతం కంటైనర్లు పనామా నుంచి ప్రయాణిస్తాయి.

## నైనారపు నాగేశ్వరరావు పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

జర్నలిస్టుల పై దాడులు మంచి పరిణామం కాదు కానీ.. తొలిసమయం పత్రికకు ఆయనకు ఎలాంటి సంబంధం లేదు... ఇలా సంస్థకు సంబంధం లేకుండా పత్రిక పేరు చెప్పుకుంటూ తిరిగే వారికి మా పత్రికకు ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించాలని కోరుతూ...

**ఎడిటర్ అయోధ్య రామయ్య**

# గంగలూర్ ఎన్కౌంటర్‌పై మావోయిస్టులు లేఖ విడుదల


भारत की कम्युनिस्ट पार्टी (माओवादी)

**చర్ల, ఫిబ్రవరి 06**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలోని గంగలూరు ప్రాంతంలోని తోడ్కా గ్రామంలో ఫిబ్రవరి 1న జరిగిన నకిలీ ఎన్‌కౌంటర్‌పై భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) దక్షిణ సబ్ జోనల్ బ్యూరో తీవ్రంగా స్పందించింది. ఈ సంఘటనను "ఊచకోత"గా అభివర్ణించిన మావోయిస్టు గ్రూపు, భద్రతా దళాలు సాధారణ గ్రామస్తులు అమాయకులైనప్పటికీ వారిని చంపేశాయని పేర్కొంది.మావోయిస్టు సంస్థ 'సమత' ప్రతినిధి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం "ఆపరేషన్ కాగర్" కింద మావోయిస్టు సంస్థను నిర్మూలించే లక్ష్యంతో ఈ ఊచకోత జరిగిందని పేర్కొన్నారు. పోలీసులు భద్రతా దళాలు నకిలీ ఎన్‌కౌంటర్లను నిర్వహిస్తున్నాయని, అమాయక గ్రామస్తులను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని ఆ ప్రకటన ఆరోపించింది.గంగలూరు పోలీస్ స్టేషన్ ప్రాంతంలో మావోయిస్టు నాయకుడు డివిసిఎం దినేష్ మోడీయం, ఇతర సాయుధ మావోయిస్టులు తోడ్కా-కోర్చోలి అడవిలో చురుగ్గా ఉన్నారని సమాచారం అందింది.ఈ సమాచారం ఆధారంగా, డి ఆర్ జి , ఎస్ టి ఎఫ్ , కోబ్రా 202 మరియు సి ఆర్ పీ ఎఫ్ 222 బెటాలియన్ల సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌నుప్రారంభించింది. 2025 ఫిబ్రవరి 1న ఉదయం 08:30 గంటలకు, మావోయిస్టులు భద్రతా దళాల మధ్య భీకర ఎన్‌కౌంటర్ జరిగింది, ఇది చాలా గంటలపాటు అడపాదడపా కొనసాగింది. ఎన్‌కౌంటర్ తర్వాత, ఆ ప్రాంతంలో సోదాలు నిర్వహించగా, 8 మంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయి.

**పండుగ రోజు రాత్రి గ్రామాన్ని చుట్టుముట్టి గిరిజనులను చంపేశారు**

పత్రికా ప్రకటన ప్రకారం, ఫిబ్రవరి 1న గడే పాండుం పండుగను జరుపుకోవడానికి సమీప ప్రాంతాల గ్రామస్తులు తోడ్కా గ్రామంలో గుమిగూడారు. ఇంతలో, సి ఆర్ పీ ఎఫ్ , కోబ్రా, ఎస్ టి ఎఫ్ , బస్తర్ ఫైటర్స్ డి ఆర్ జి సైనికులు గ్రామాన్ని అన్ని వైపుల నుండి చుట్టుముట్టి గ్రామస్తులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో, తోడ్కా గ్రామానికి చెందిన తాటి శంకర్, తాటి మంగళ్, తాటి కమలు, తాటి రాను, తాటి సన్ను కోర్చోల్ గ్రామానికి చెందిన పదం బిజు, తాటి లచ్చు, నీల్కండ్ కమలేష్ మరణించారు.కాల్పుల్లో మరో 24 మంది గ్రామస్తులు తీవ్రంగా గాయపడ్డారని, 67 మందిని అదుపులోకి తీసుకుని బీజాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, అక్కడ వారిని చిత్రహింసలకు గురిచేస్తున్నారని మావోయిస్టు సంస్థ పేర్కొంది.ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు మరణించారని, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారని పోలీసులు చేసిన ప్రకటనలు అబద్ధమని ఆ సంస్థ పేర్కొంది.

**లేఖలో ఇటీవల జరిగిన నకిలీ ఎన్‌కౌంటర్ ప్రస్తావన**

మావోయిస్టు సంస్థ తన ప్రకటనలో గతంలో భద్రతా దళాలు అమాయక గ్రామస్తులను చంపినట్లు ఆరోపణలు వచ్చిన సంఘటనలను కూడా ప్రస్తావించింది. 11 డిసెంబర్ 2024: ముఠంగ గ్రామంలో మద్వి పాండును వెంబడించి చంపారు. 16 జనవరి 2025: తమెల్‌బట్టి ప్రాంతంలోని సింగనపల్లి-పుజారి కాంకేర్‌లో 8 మంది పిఎల్‌జిఎ కార్యకర్తలు 4 మంది పౌర గ్రామస్తులు చంపబడ్డారు. వందలాది మంది గిరిజనులను "నక్సలైట్లు" అని ముద్రవేసి జైలులో పెట్టారు.

**"ఆపరేషన్ కాగర్" పేరుతో గిరిజనులపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆరోపణలు.**

"ఆపరేషన్ కాగర్" కింద కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు బస్తర్ ప్రాంతాన్ని పోలీసు కంటోన్మెంట్‌గా మారుస్తున్నాయని మావోయిస్టు సంస్థ ఆరోపించింది. గత ఒక సంవత్సరంలో, 20 కొత్త పోలీసు శిబిరాలు స్థాపించబడ్డాయి, అక్కడి నుండి భద్రతా దళాలు రోజూ గ్రామస్తులపై దాడి చేస్తున్నాయి.గిరిజన గ్రామాలపై దాడులు, అమాయక గ్రామస్తులను చంపడం, మహిళలపై దౌర్జన్యాలు, బలవంతంగా నిర్బంధించడం హింసించడం, దోపిడీలు మరియు ఆస్తులను తగలబెట్టడం వంటివి పోలీసులు మరియు భద్రతా దళాలు చేస్తున్నాయని కూడా ఆ ప్రకటన ఆరోపించింది .ఈ దాడుల్లో భారత సైన్యం ప్రమేయం ఉందని మావోయిస్టు సంస్థ ఆరోపించింది, 81ఎం ఏం రాకెట్ లాంచర్ల నుండి బాంబు దాడులు జరుగుతున్నాయని డ్రోన్ విమానాల ద్వారా నిఘా జరుగుతోందని పేర్కొంది.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల ప్రకారం, బస్తర్ ప్రాంతంలోని గిరిజనులను వారి భూమి నుండి వెళ్ళగొట్టడానికి కుట్ర జరుగుతోందని ఆ ప్రకటనలో పేర్కొంది.

**జోక్యం చేసుకోవాలని మానవ హక్కుల సంస్థలు మరియు మేధావులకు విజ్ఞప్తి**

ఈ ఊచకోతపై న్యాయమైన దర్యాప్తు నిర్వహించి, దోషులను శిక్షించాలని మానవ హక్కుల కార్యకర్తలు, మేధావులు, ఛత్తీస్‌గఢ్ బచావో మంచ్, పియుసిఎల్, మీడియా సిబ్బంది మరియు ఇతర ప్రజా సంస్థలను మావోయిస్టు సంస్థ డిమాండ్ చేసింది.నీరు, అడవులు మరియు భూమిని రక్షించడానికి దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని "ఆపరేషన్ కాగర్"కు వ్యతిరేకంగా స్వరం పెంచాలని కూడా ఆ సంస్థ విజ్ఞప్తి చేసింది. ఇలా పలు అంశాలపై మావోయిస్టులు లేఖ విడుదల చేసారు .

# ఉత్తమ విద్యార్థికి బహుమతి అందజేత

**- ముఖ్య అతిధులుగా పాల్గొన్న ఏం ఈ ఓ రమణ - మీకోసం మేమున్నాం కమిటీ చైర్మన్ డాక్టర్ నీలి ప్రకాష్**

**చర్ల, ఫిబ్రవరి 06**




చర్ల మండలంలో గల తేగదా శ్రీసరస్వతి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు మేమున్నాం సహాయక సంస్థ చర్ల కు అందించిన పొదుపు విరాళానికి స్పందిస్తూ ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ నీలి ప్రకాష్ స్వయంగా విద్యార్థులను అభినందించడానికి పాఠశాలకు విచ్చేయడం జరిగింది. వారితో పాటుగా చర్ల మండలం విద్యాధికారిని, వారి గురువు ని కూడా తీసుకొని రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలం విద్యాధికారి రమణ మాట్లాడుతూ శ్రీ సరస్వతి విద్యానికేతన్ యాజమాన్యం చిన్నారుల్లో సేవా భావాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహించి మానవతా విలువలను పెంపొందించే క్రమంలో ఆపదల సమయంలో చిన్నారులు కూడా మేమున్నామంటూ ముందుకు వచ్చి వాళ్లు కూడా కొంత డబ్బుని పోగుచేసి మేమున్నాం సంస్థకు ఇచ్చి పేద ప్రజలను ఆదుకోవడానికి ముందుకు తీసుకురావడం మానవతా పెంపొందించడం అని ఈ పాఠశాల సిబ్బంది యొక్క గొప్పతనం విద్యార్థుల యొక్క ఔన్నత్యాన్ని పెంచారు.అలానే స్కూలు మంచి అభివృద్ధి పథంలో ఉందని మంచి విద్యని అందిస్తుందని పేరు వచ్చిందని ఎంఈఓ రమణ స్కూల్ ను సిబ్బందిని విద్యార్థులను మెచ్చుకున్నారు. డాక్టర్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ పక్కవాడికి సాయం చేయడం అన్నది మన చేతుల్లో ఉన్న పని అని తప్పనిసరిగా మన పక్క వారికి సాయం అందించాలని విద్యార్థులకు సూచించారు చదువుతోపాటు మానవతా విలువలు కూడా ముఖ్యమని విద్యార్థులని ఇంటికి వెళ్లిన తర్వాత చుట్టుపక్కల గమనించమని గమనించి మంచి వైపు ప్రయాణం చేయాలని ఆ ప్రయాణంలోనే కష్టాలు పడే వారు బాధలు పడేవారు ఆరోగ్య బాధలు రోడ్లు దాటించడం వంటివి బస్సు ఎక్కించడానికి సహాయ పడడం ముసలి వాళ్ళని రోడ్లు దాటించడం ఈ విధంగా సాయం అనేది మనం ఏ రూపంలోనైనా చేయొచ్చని విద్యార్థులకు సూచించారు. అలానే మంచి స్నేహితులనీ ఏర్పరచుకోమని మనం ఒకరి గురించి ఆలోచిస్తే మన గురించి పదిమంది ఆలోచిస్తారని, రేపటి తరం తలరాతను మార్చేది మీరే అని మనం మార్చుకుంటూ వెళ్లాలంటే ముందు మన మనసులో మార్పు రావాలి మార్పు ఎంత గట్టిగా ఉండాలంటే తరాన్ని తలరాతను మార్చే విధంగా ఉండాలి అని సూచించారు.నరసింహారావు మాస్టర్ మాట్లాడుతూ మనం ఆస్తిని పోగొట్టుకుంటే పెద్ద నష్టమేమీ కాదు కానీ వ్యక్తిత్వాన్ని పోగొట్టుకుంటే సర్వము నష్టపోయినట్టే కాబట్టి సత్ప్రవర్తనని ముందుగా నేర్చుకొని చక్కటి విద్యా బుద్ధులతో మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు తద్వారా మీ గ్రామానికి కూడా మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచన ఇచ్చారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు లిఖిత మాట్లాడుతూ మా విద్యార్థులు చేసిన చిన్ని సాయాన్ని గుర్తించి మా పాఠశాలకు విచ్చేసి వారిని అభినందించడం అనేది చాలా ఆనందాన్ని కలిగిస్తుందని, దీని ద్వారా వారి సహృదయాన్ని మరొక్కసారి చాటుకున్నారని డాక్టర్ నీల్ ప్రకాష్ కి, ఎంఈఓ కి, నరసింహారావు మాస్టర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. అలానే వారి రాకకు గుర్తుగా స్కూల్లో మొక్కలు నటించడం జరిగింది. విద్యార్థులకు గొప్ప పనులు చేస్తూ గొప్ప మార్గంలో నడిచే వారి అనుభవాలను వినాలని వాటిని స్ఫూర్తిగా తీసుకొని మీరు కూడా ఎంతో గొప్పగా ఎదిగి మీ గొప్పతనంలో మీ తల్లిదండ్రులకు మీ గురువులకు భాగస్వామ్యాన్ని ఇచ్చి గ్రామానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల విద్యాధికారి రమణ, మేమున్నాం సహాయక సంస్థ చైర్మన్ డా .నీలి ప్రకాష్ , చర్ల జడ్పీహెచ్ఎస్ స్కూలు మాస్టర్ నరసింహ మాస్టర్ స్కూలు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒడిదుడుకులను ఎదుర్కొన్న సూచీలు

**భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**ముంబై,ఫిబ్రవరి6:** దేశీయ స్టాక్ మార్కెట్ భారీ నష్టాలతో ముగిసింది. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ.. శుక్రవారం ఆర్బీఐ పాలసీ వెలువడనుంది. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి కూడా సూచీలు ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే ఉంది. చివరికి నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 213 పాయింట్లు నష్టపోయి 78, 058 దగ్గర ముగియగా.. నిఫ్టీ 92 పాయింట్లు నష్టపోయి 23, 603 దగ్గర ముగిసింది. ఇక రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 87.57 దగ్గర సరికొత్త కనిష్ట స్థాయిలో ముగిసింది. నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్ కంపెనీ, ఎన్‌టీపీసీ అత్యధికంగా నష్టపోగా.. సిఎ÷-లా, అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టాటా కన్స్యూమర్ లాభపడ్డాయి. రంగాలలో ఫార్మా, ఐటీ, ప్రైవేట్ బ్యాంక్ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు ఆటో, ఎఫ్ఎంసిజి, రియాల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1-2 శాతం మధ్య పడిపోయాయి. మెటల్, పీఎస్‌యు బ్యాంక్, ఎనర్జీ, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్ 0.4-0.8 శాతం క్షీణించాయి.

## సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు అందజేత

**కరీంనగర్ ఫిబ్రవరి 06**



ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ హుజురాబాద్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల( బాలుర )గురుకుల విద్యాలయంలో సైదాపూర్ శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులందరికీ గురువారం సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆఖ్యారపురాణి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికి తీయుటకు టాలెంట్ టెస్టులు ఉపయోగపడతా యని,ప్రతి సంవత్సరము ఈ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడులు ఇవ్వడము,టాలెంట్ టెస్టులు నిర్వహించడం అభినందనీయమని,ట్రస్ట్ చేసే సేవ కార్యక్రమాలను కొనియాడారు.అనంతరం మంచి ప్రతిభ కనబరిచిన మొదటి నలుగురు విద్యార్థులకు బహుమతులను ప్రిన్సిపాల్ ఆఖ్యారపు రాణి చేతుల మీదుగా ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) బహుమతులు అందజేశారు.విజేతలు అశ్వదు,అరవింద్,సిద్ధార్థ, వినాయకు లకు శంకర్ నారాయణ డిక్షనరీలు,మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజెపి అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## దయ్యాల సదయ్యను పరామర్శించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య

**నివాళులు అర్పించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోటగిరి సతీష్ గౌడ్**



**మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 06**

జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) రాష్ట్ర కమిటీ సభ్యులు దయ్యాల సదయ్య తండ్రి దయ్యాల రాజయ్య ఇటీవల మృతి చెందగా వారి స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం మెట్ పల్లిలో వారి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుమారులైన దయ్యాల సదయ్యను,అతని సోదరున్ని పరామర్శించారు. తండ్రిగారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు లు దుండ్ర కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాండ్ల రవీందర్ గౌడ్, నాయకులు శ్రీకాంత్, క్రాంతి కుమార్, మొగుళ్లపల్లి మండల అధ్యక్షులు మెరుగు సురేష్, మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజకుమార్, మండల ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు సంగి రవి, చంద్రమౌళి, ములుగు జిల్లా సంయుక్త కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్



గురువారము రోజున ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అనిత దేవి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికి తీయుటకు టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని , ప్రతి సంవత్సరము ఈ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడులు ఇవ్వడము, టాలెంట్ టెస్టులు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం మంచి ప్రతిభ కనబరిచిన మొదటి నలుగురు విద్యార్థులకు బహుమతులను స్పెషల్ ఆఫీసర్ అనిత దేవి చేతుల మీదుగా ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) బహుమతులు అందజేశారు.

## నకిలీ ఐడి కార్డుతో సచివాలయ ప్రవేశానికి యత్నం

**హైదరాబాద్,ఫిబ్రవరి6:** తెలంగాణ సచివాలయంలోకి నకిలీ తహసీల్దార్ వెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది. తిప్పర్తి తహసీల్దార్ అని చెప్పి అంజయ్య అనే వ్యక్తి నకిలీ ఐడీ కార్డుతో సచివాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చి అడ్డుకున్నారు. తిప్పర్తి ఎంఆర్‌వో కార్యాలయానికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవడంతో అంజయ్య నకిలీ తహసీల్దార్ అని తేలింది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101